క్లుప్తంగా

వైభవంగా సీతారాముల శాంతి కల్యాణం



ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

విజయనగరం రూరల్: మండలంలోని సారిక పంచాయతీ పరిధిలో ఉన్న శ్రీరామనారాయణంలో సీతారాముల శాంతి కల్యాణాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. పునర్వసు నక్షత్రాన్ని పురస్కరించుకుని కల్యాణం చేపట్టినట్లు ప్రధానార్చకుడు రంగాచార్యులు తెలిపారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం..



కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌కు రూ.20 వేల చెక్కు అందజేస్తున్న రిటైర్డ్ ఉద్యోగి సత్యనారాయణ

విజయనగరం అర్బన్: వరద బాధితులను ఆదుకునేందుకు పలువురు ముందుకు వస్తున్నారు. జలవనరుల శాఖలో ఉప కార్యనిర్వాహక ఇంజినీర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన నగరంలోని పద్మావతినగర్‌కు చెందిన ఎల్ఆర్ సత్యనారాయణ రూ. 20 వేల విరాళాన్ని కలెక్టర్ అంబేడ్కర్‌కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణను కలెక్టర్ అభినందించారు.

అంగన్‌వాడీ కేంద్రం పరిశీలన



చిన్నారులతో మాట్లాడుతున్న ప్రత్యేక అధికారి శాంతకుమారి, తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని పేరాపురం అంగన్‌వాడీ కేంద్రాన్ని మండల ప్రత్యేకాధికారి బి. శాంతకుమారి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా చిన్నారులకు అందుతున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలకు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారం సక్రమంగా సరఫరా చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో భోగాపురం సీడీపీఓ ఎస్తేరురాణి, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు బొంతు రవికుమార్, కొలచిన రమేష్, కార్యకర్తలు శకుంతల, చిన్నమ్మలు, తదితరులు పాల్గొన్నారు.

ఫార్మాసిస్ట్‌ల పాత్ర కీలకం..



ఫార్మసీ నమూనాలను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

విజయనగరం ఫూల్‌బాగ్: ఆరోగ్యకర సమాజ నిర్మాణంలో ఫార్మాసిస్ట్‌ల పాత్ర కీలకమని మహారాజా ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి. ఉదయ్‌శంకర్ అన్నారు. ప్రపంచ ఫార్మాసిస్ట్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం స్థానిక మహరాజా ఫార్మసీ కళాశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వివిధ రకాల ఫార్మసీ నమూనాల మీద వ్యాసరచన పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

అన్నసమారాధన

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని కీర్తివీధిలో గురువారం భారీ అన్న సమారాధన చేపట్టారు. గణేష్ ఉత్సవాల్లో భాగంగా సుమారు ఐదువేల మంది భక్తులకు స్వామివారి అన్నప్రసాదం వడ్డించారు. ఓ వైపు వర్షం కురుస్తున్నప్పటికీ భక్తులు స్వామివారి ప్రసాదం స్వీకరించడానికి బారులుతీరారు. ఉత్సవ కమిటీ సభ్యులు సేవలందించారు.

చదువుతో పాటు క్రీడలు



విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎమ్ జ్ఞానశంకర్, తదితరులు

నెల్లిమర్ల రూరల్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని కొండవెలగాడ ఉన్నత పాఠశాల హెచ్ఎం వి.జ్ఞానశంకర్ అన్నారు. జిల్లా స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులను గురువారం అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల్లో రాణిస్తున్న చాలా మంది ఉన్నత స్థాయిలో స్థిర పడ్డారన్నారు. వెయిట్‌లిఫ్టింగ్ క్రీడకు కొండవెలగాడ పుట్టినిల్లుగా పేరు పొందిందని చెప్పారు. ఇప్పటికే చాలా మంది కేంద్ర ప్రభుత్వ కొలువుల్లో స్థిరపడ్డారని, వారిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థులు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. జిల్లా స్థాయి పోటీల్లో సత్తా చాటి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, సిబ్బంది పాల్గొన్నారు.

కోనాడ దేవాలయ భూములకు శఠగోపం

- సుమారు 100 ఎకరాలున్నా వసూలు కాని శిస్తు
- అక్రమార్కుల చేతిలో దేవస్థానం భూములు



కోనాడ వేణుగోపాలస్వామి ఆలయం

పూసపాటిరేగ : మండలంలోని కోనాడ గ్రామంలో గల అతి పురాతనమైన వేణుగోపాలస్వామి, మణి నాగలింగేశ్వర, రామలింగేశ్వరస్వామి దేవస్థానాలు ఉత్తరాంధ్రలోనే ప్రసిద్ధిగాంచినవి. ఆయా ఆలయాలకు సంబంధించి కోనాడ, ఎరుకొండ, వెలుదూరు రెవెన్యూ పరిధిలో సుమారు వంద ఎకరాల దేవస్థానం భూమి ఉంది. వాటి ద్వారా వచ్చిన శిస్తుతో ఆలయాలను నిర్వహించేవారు. అయితే దేవాలయ భూములు అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లడంతో ఆలయాల నిర్వహణ కష్టంగా మారింది. దేవదాయ శాఖాధికారులు నిర్ణయించిన నామమాత్రపు శిస్తు కూడా వీరు చెల్లించడం లేదు. పైగా భూములు ఒకరి నుంచి మరొకరికి చేతులు కూడా మారినా అధికారులు పట్టించుకోవడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉమారామలింగేశ్వర ఆలయానికి 28.09 ఎకరాలు, మణి నాగలింగేశ్వర ఆలయానికి 7.80 ఎకరాలు, వేణుగోపాలస్వామి ఆలయానికి 30.14 ఎకరాలు ఉన్నట్లు దేవస్థానం రికార్డులు చెబుతున్నాయి. అయితే సుమారు 93 ఎకరాల భూమికిగాను సుమారు 66 ఎకరాల భూమి కోనాడ దేవస్థానానికి చెందినవని రికార్డులు చెబుతున్నాయి. మిగతా దేవస్థానం భూమి ఎక్కడ ఉంది అనేది మిలియన్ డాలర్ల ప్రశ్నగా మారింది. తాజాగా కోనాడ దేవస్థాన భూముల్లో కొంతమేర సర్వే చేయించినట్లు చెబుతున్నారు. అక్రమణలో ఉన్న భూములన్నింటినీ సర్వే చేయాలని భక్తులు కోరుతున్నారు. ఇదే విషయమై ఆలయ ఈఓ ఎం. జగదీశ్వరి వద్ద ప్రస్తావించగా.. కోనాడ దేవస్థానం భూములకు సంబంధించి సర్వే ప్రారంభించామన్నారు. రైతులు సహకరించక పోవడం వల్ల సర్వేలో జాప్యం జరుగుతోందని, ఏది ఏమైనా దేవదాయ భూములను కాపాడేందుకు అన్ని చర్యలు తీసుకుంటామన్నారు.

కూటమి నేతలే ముద్దు..స్థానిక ప్రజాప్రతినిధులు వద్దు..

- ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం వేదికపై అనధికారిక వ్యక్తులు
- తీరు మార్చుకోని కార్పొరేషన్ యంత్రాంగం



కార్యక్రమంలో మాట్లాడుతున్న కమిషనర్, అతని పక్కనే కూటమి నాయకులు

విజయనగరం: ప్రభుత్వం అధికారికంగా నిర్వహించే ఏ కార్యక్రమంలోనైనా ప్రజలతో ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులు, అధికారులు వేదికపై కనిపిస్తుంటారు.ఒక వేళ అనివార్య కారణాల రీత్యా స్థానిక ప్రజాప్రతినిధులు హాజరుకాకుంటే అధికారులు ఆ కార్యక్రమాన్ని నిర్వహించాలి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మొదటి సారిగా క్షేత్రస్థాయిలో నిర్వహిస్తోన్న ఇది మంచి ప్రభుత్వం కార్యక్రమం విజయనగరం కార్పొరేషన్ పరిధిలో అందుకు భిన్నంగా జరుగుతోంది. కూటమిలో భాగస్వామ్యమైన టీడీపీకి చెందిన నాయకులు పచ్చ కండువాలు వేసుకుని వేదికలపై ఆశీనులు కావడం అందరినీ ఆశ్చర్యానికి గురి చేస్తోంది. ప్రొటోకాల్ పాటించాల్సిన అధికారులు సైతం వారికే గ్రీన్ కార్పెట్ వేయటం గమనార్హం. గురువారం నగరంలోని 37వ డివిజన్ బీసీ కాలనీలో నిర్వహించిన కార్యక్రమమే ఇందుకు తార్కాణంగా నిలుస్తోంది. కమిషనర్ పక్కనే ఎటువంటి పదవులు లేని అనధికారిక వ్యక్తులు కూర్చున్నారు.

డిప్యూటీ తహసీల్దార్‌గా రవిశంకర్

నెల్లిమర్ల: నెల్లిమర్ల హెడ్‌క్వార్టర్స్ డిప్యూటీ తహసీల్దార్‌గా రవిశంకర్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రవిశంకర్ గజపతినగరం సీఎస్‌డీటీగా పనిచేస్తూ ఇక్కడికి బదిలీపై వస్తున్నారు. అలాగే ఇంతవరకు ఇక్కడ డీటీగా పనిచేసిన డి. శైలజకు విజయనగరం భూసేకరణ విభాగానికి (యూనిట్-3) బదిలీ అయ్యింది. అలాగే ఎన్నికల డీటీగా పనిచేస్తున్న మూర్తికి గంట్యాడ సీఎస్‌డీటీగా బదిలీ అయ్యింది.

వచ్చే నెల 1,2, తేదీల్లో జనజాతి సమ్మేళనం



ప్రచార పోస్టర్లను విడుదల చేస్తున్న డీఆర్వో ఎస్‌డీ అనిత, తదితరులు

విజయనగరం అర్బన్: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో విజయనగరంలో అక్టోబర్ 1, 2 తేదీలలో జనజాతి విద్యార్థుల సమ్మేళనం నిర్వహించనున్నట్లు ఏబీవీపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఎ. ఆనంద్ తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను గురువారం స్థానిక కలెక్టరేట్‌లో డీఆర్‌ఓ ఎస్‌డీ అనిత విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భారతీయ సంస్కృతికి మూలాధారమైన జనజాతి సంస్కృతి సంప్రదాయాలు భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి జనజాతి బిడ్డపై ఉందన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ బొబ్బది సాయి కుమార్, విభాగ్ సంఘటన కార్యదర్శి పెంచలయ్య, గిరిజన విద్యార్థుల రాష్ట్ర కన్వీనర్ గెమ్మెలి కల్యాణ్, పార్వతీపురం జిల్లా కన్వీనర్ అల్లంగి మహేష్, నాని, తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

- ఎస్సై గణేష్



అవగాహన కల్పిస్తున్న ఎస్సై గణేష్

నెల్లిమర్ల రూరల్: విద్యార్థి దశ నుంచే ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు కృషి చేయాలని ఎస్సై గణేష్ అన్నారు. మండలంలోని సతివాడ ఆదర్శ పాఠశాలలో వివిధ అంశాలపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చదువుపై పూర్తి స్థాయిలో దృష్టి సారించి ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించారు. బాలికలు, మహిళల పట్ల ఎవరైనా వేధింపులకు పాల్పడితే ధైర్యంగా ఫిర్యాదు చేయాలన్నారు. ప్రతి విషయాన్నీ ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో పంచుకోవాలన్నారు. గంజాయి, డ్రగ్స్ వినియోగంతో బంగారు భవిష్యత్ పాడవుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మలత, సిబ్బంది పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

- ఎమినిటీస్ కార్యదర్శులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి
- కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య



సమావేశంలో మాట్లాడుతున్న కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య

విజయనగరం: ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మన ఇల్లు - మన గౌరవం కార్యక్రమంలో భాగంగా శతశాతం ఇళ్ల నిర్మాణాలే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పి. నల్లనయ్య ఆదేశించారు. ఈ కార్యక్రమ పర్యవేక్షణకై సచివాలయాల వారీగా ప్రత్యేక అధికారులను నియమించారు. గురువారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫిబ్రవరి 2025 నాటికి ఆప్షన్ 1,2 విధానంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి కావాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఆ సమయానికి ఇళ్ల నిర్మాణాలు పూర్తయితేనే మార్చి 2025 నుంచి ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 పథకం ప్రారంభమవుతుందని చెప్పారు. ఇందుకోసం ఈనెల 28న ఆనందగజపతి ఆడిటోరియంలో గృహ లబ్ధిదారులతో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎంఈ శ్రీనివాసరావు, టీపీఆర్‌ఓ సింహాచలం, 'మన ఇల్లు - మన గౌరవం' ప్రత్యేక అధికారులు, ఎమినిటీస్, వెల్ఫేర్ కార్యదర్శులు పాల్గొన్నారు.

బాధ్యతగా వ్యవహరించండి..

వార్డు ఎమినిటీస్ కార్యదర్శులు మెరుగైన పనితీరు కనబరచడంతో పాటు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కమిషనర్ నల్లనయ్య సూచించారు. నగర రూపురేఖలు మారాలంటే ఎమినిటీస్ కార్యదర్శులదే కీలకపాత్ర అని తెలిపారు. ప్రతిరోజూ క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. కనీసం నెలకు ఒక్కసారైనా వాటర్ ట్యాంక్‌లను పరిశుభ్రం చేయాలని సూచించారు. కాలువల్లో ఎప్పటికప్పుడు పూడికతీత పనులు చేపట్టాలన్నారు.

మాజీ ఉపరాష్ట్రపతికి ఘన స్వాగతం



సైనిక పాఠశాలలోకి ప్రవేశిస్తున్న మాజీ ఉపరాష్ట్ర పతి వెంకయ్యనాయుడు



వెంకయ్యనాయుడుకు మొక్క అందజేస్తున్న ఎస్పీ వకుల్‌జిందాల్

విజయనగరం రూరల్: మండలంలోని కోరుకొండ సైనిక్ స్కూల్‌కు వచ్చిన మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు కలెక్టర్ బీఆర్ అంబేడ్కర్, ఎస్పీ వకుల్‌జిందాల్, సైనిక పాఠశాల ప్రిన్సిపాల్, గ్రూప్ కెప్టెన్ ఎస్.ఎస్.శాస్త్రిలు గురువారం ఘనంగా స్వాగతం పలికారు. ఉపరాష్ట్రపతి సైనిక పాఠశాలలో గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం పాఠశాల పరిసర ప్రాంతాలను తిలకించారు. కార్యక్రమంలో ఆర్డీఓ సూర్యకళ, లైజినింగ్ అధికారి మురళీకృష్ణ, తహసీల్దార్ కూర్మనాథరావు, సైనిక పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు

డ్రగ్స్‌ను నిర్మూలిద్దాం..

విజయనగరం ఫూల్‌బాగ్: డ్రగ్స్‌ను నిర్మూలించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు రవికుమార్ అన్నారు. మత్తు పదార్థాలను నిర్మూలించాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో గురువారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్, రైల్వేస్టేషన్ వద్ద ఫ్లాష్‌మాబ్ నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ, జిల్లాలో రోజురోజుకీ డ్రగ్స్ వినియోగం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలను నిర్మూలించాలని కోరుతూ ఈనెల 28, 29, 30 తేదీల్లో విజయనగరంలో గల గురజాడ కళాక్షేత్రంలో భగత్‌సింగ్ స్టూడెంట్ ఫెస్ట్ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎస్. సమీరా, ఎం. రమేష్, రాజు, సుస్మిత, రమణ, చరణ్, తదితరులు పాల్గొన్నారు.



కాంప్లెక్స్ వద్ద ఫ్లాష్‌మాబ్‌ను ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సమస్యల పరిష్కారానికే 'గ్రామ సందర్శన'



డెంకాడ: ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి జమదగ్ని



విజయనగరం: పదో డివిజన్‌లో పర్యటిస్తున్న అసిస్టెంట్ కమిషనర్ తిరుమలరావు, తదితరులు

డెంకాడ: గ్రామాల్లో నెలకొన్న సమస్యలు తెలుసుకుని పరిష్కరించడానికే గ్రామసందర్శన కార్యక్రమం నిర్వహిస్తున్నామని మండల ప్రత్యేకాధికారి జమదగ్ని అన్నారు. మండలంలోని గొలగాంలో గురువారం గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు పాఠశాలలను సందర్శించి, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. అలాగే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి చిన్నారులకు అందిస్తున్న పౌష్టికాహారంపై ఆరా తీశారు. అలాగే ఆర్‌బీకే, సచివాలయాలను సందర్శించి, ప్రజలకు అందుతున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ స్వరూపారాణి, తహసీల్దార్ పద్మావతి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

10వ డివిజన్‌లో..

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 10వ డివిజన్‌లో అధికారులు వార్డు పర్యటన చేపట్టారు. సుంకరవీధి నుంచి ప్రారంభమైన వార్డు పర్యటనలో పారిశుధ్యం, అంగన్‌వాడీ కేంద్రాలు, పార్కుల స్థితిగతులను పరిశీలించారు. అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు ఆధ్వర్యంలో సిబ్బంది ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని చెప్పారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, ఏఓ సీతారామమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కారం..

విజయనగరం రూరల్: కలెక్టర్ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న గ్రామసందర్శన కార్యక్రమంతో పలు సమస్యలను పరిష్కరిస్తున్నట్లు పంచాయతీ విస్తరణాధికారి తిరుపతిరావు అన్నారు. మండలంలోని బియ్యాలపేటలో నిర్వహించిన గ్రామసందర్శనలో భాగంగా ముందుగా పాఠశాలలను సందర్శించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామసభలో మాట్లాడుతూ, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

మండల అధికారుల డుమ్మా

బియ్యాలపేటలో నిర్వహించిన గ్రామసందర్శన కార్యక్రమానికి మండల ప్రత్యేక అధికారి అరుణకుమారి, ఎంపీడీఓ హర్షలతతో పాటు పలువరు మండల స్థాయి అధికారులు డుమ్మాకొట్టారు. ఈఓపీఆర్‌డీ ఒక్కరే అన్నీ తానై కార్యక్రమాన్ని నడిపించడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు.

- సమస్యల పరిష్కారానికి కృషి..



నెల్లిమర్ల రూరల్: మొయిదలో గ్రామస్తులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు

నెల్లిమర్ల రూరల్: గ్రామ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని మండల నోడల్ అధికారి, హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ వి. శ్రీనివాస్ అన్నారు. మండలంలోని మొయిద విజయరాంపురం గ్రామంలో గ్రామ సందర్శన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిబ్బందితో కలిసి స్థానిక ఆరోగ్య కేంద్రం, పశు వైద్యశాల, ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించారు. అనంతరం గ్రామంలో పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కృష్ణ, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విజయనగరం ఫోర్ట్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పెద్దింటి త్రినాథరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 11 కేవీ సాయిబాబా టెంపుల్ ఫీడర్ మీద ఉన్న చెట్టు కొమ్మలు తొలగించే క్రమంలో ఉడాకాలనీ ఫేజ్-2, ఇతర ప్రదేశాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆరోగ్యంపై అవగాహన సదస్సు

నెల్లిమర్ల: సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మిమ్స్ ఆధ్వర్యంలో గురువారం ఆరోగ్యంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వైద్యులు మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకున్నప్పుడే ఆరోగ్యంగా ఉంటారన్నారు. కార్యక్రమంలో వైద్యులు పీఎస్ సుధాకర్, టి.శశికుమార్, ఐ. ఆదిలక్ష్మి, జూనియర్ కాలేజ్ ప్రిన్సిపాల్ మజ్జి సత్యనారాయణ, ఎన్ఎస్ఎస్ పీఓలు లెంక సంధ్య, ఎస్. అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు పవిత్రోత్సవాలకు అంకురార్పణ



సీతారామచంద్రస్వామి ఉత్సవ విగ్రహాలు

నెల్లిమర్ల రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో శుక్రవారం నుంచి పవిత్రోత్సవాలు ప్రారంభం కానున్నాయి. ఉత్సవాలకు సంబంధించి ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం సాయంత్రం ఆరు గంటలకు విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా జరిపించి పవిత్రోత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. 30న సీతారామచంద్రస్వామికి శాంతి కల్యాణం జరిపించి పవిత్రోత్సవాలకు ముగింపు పలకనున్నారు.

ఉపాధ్యాయురాలిగా మండల ప్రత్యేకాధికారి



పాఠశాలలో మధ్యాహ్నభోజనాన్ని పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి శాంతకుమారి, తదితరులు

పూసపాటిరేగ : మండల ప్రత్యేకాధికారి బి. శాంతకుమారి ఉపాధ్యాయురాలి అవతారం ఎత్తారు. మండలంలోని పేరాపురం ప్రాథమిక పాఠశాలను పలువురు అధికారులతో గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా మండల ప్రత్యేకాధికారి శాంతకుమారి విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. అలాగే వారి అనుమానాలను నివృత్తి చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీడీపీఓ ఎస్తేరురాణి, ఈఓపీఆర్‌డీ శ్రీనివాసరావు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

29న అవగాహన ర్యాలీ



సమావేశంలో మాట్లాడుతున్న ఆస్పత్రి ఎం.డి తిరుమల ప్రసాద్

విజయనగరం ఫోర్ట్: గుండె పరిరక్షణపై ఈనెల 29న తిరుమల మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించనున్నట్లు ఆస్పత్రి ఎం.డి కొడాలి తిరుమల ప్రసాద్ తెలిపారు. ఆస్పత్రి ఆవరణలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, వివిధ స్వచ్ఛంద సంస్థల సహకారంతో నిర్వహిస్తున్న ఈ ర్యాలీని కోట వద్ద ఎస్పీ వకుల్ జిందాల్, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి ప్రారంభిస్తారని తెలిపారు. ర్యాలీ అనంతరం సెమినార్ హాల్లో గుండె సమస్యలపై ప్రత్యేక వైద్యులతో అవగాహన సదస్సు ఉంటుందని తెలిపారు. అదే రోజు ఆస్పత్రిలో ఉచితంగా బీపీ, సుగర్, ఈసీజీ, తదితర పరీక్షలను మొదటిగా పేరు నమోదు చేసుకున్న 100 మందికి ఉచితంగా చేస్తామని చెప్పారు. సమావేశంలో డాక్టర్ శరత్‌కుమార్ పాత్రో, డాక్టర్ బి.రవికుమార్, డాక్టర్ జి. వాసుబాబు, డాక్టర్ ఆర్‌వీ దుర్గాప్రసాద్, ఆస్పత్రి సెంటర్ హెడ్ ఎస్. మల్లికార్జునరావు, డాక్టర్ భట్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు అన్ని రంగాల్లో రాణించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎ.డి జగదీష్

- విభిన్న ప్రతిభావంతుల శాఖ ఎ.డి జగదీష్

విజయనగరం ఫోర్ట్: దివ్యాంగులు సామాజికంగా, ఆర్థికంగా అన్ని రంగాల్లో రాణించాలని విభిన్న ప్రతిభావంతులు సంక్షేమశాఖ ఎ.డి జీవీబీ జగదీష్ ఆకాంక్షించారు. లెప్రసీ మిషన్ ఏర్పాటై 150 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా హీల్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో దివ్యాంగులు, లెప్రసీ వ్యాధిగ్రస్తులతో గురువారం చాంపియన్ వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దివ్యాంగులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ అర్చన, హీల్ ప్రాజెక్ట్ మేనేజర్ కిస్మత్ నందా, కోఆర్డినేటర్ తాలాడ దీప్తి, సత్తి అచ్చిరెడ్డి, హెల్పింగ్ హ్యాండ్స్ హిజ్రాల సంక్షేమ సంఘ అధ్యక్షుడు కొండబాబు, తదితరులు పాల్గొన్నారు .